# బొమ్మా - బొరుసు

'మమ్మీ తలుపు తియ్యి' పధ్నాలుగేళ్ళ రాధిక తలుపు బాదుతూ అరుస్తోంది. ముందు గదిలో సిగరెట్లు కాలుస్తన్న మాధవరావు గబగబా వచ్చి 'ఏమిటి గోల, మీ మమ్మీ లోపల డ్రెస్ చేసుకుంటోంది' అన్నాడు.

'ఏమిటీ....ఇందాకా' రాధిక ఏదో అనబోయి...'ఛీ'! అని విసురుగా పక్కనున్న కుర్చీని తన్నింది.

రాధికకు ఎప్పుడూ అర్థం కాదు. అమ్మా నాన్నల పద్ధతి. అర్థగంట క్రితం అమ్మ కోపంతో అరవడం, అంతకన్నా పెద్దగా నాన్న అరవడం చూసింది.... అమ్మ తలుపేసుకు తీయకపోతే భయపడిపోయింది. రాధిక సోఫాలో కూచుంది.

'రాధీ! నేనూ, డాడీ క్లబ్బు కెళ్ళి భోజనం చేసి వస్తాము. వంట చేసి పెట్టేశాను' రాధిక తల్లి...తండ్రి కారు బయటికి తీసి స్టార్ట్ చేశాడు.

ఆ పెద్ద ఇంట్లో నాయనమ్మ, నౌకరు, తను మిగిలారు రాధకకు అర్థంకాని విషయం ఒక్కటే ఇలా పోట్లాడుకుని అలా ఎలా కలిసిపోతారూ! ఈ మాటే అంటే నాయనమ్మ ఫక్కున నవ్వింది.

"మీ తాతయ్యకి కోపం వస్తే చచ్చేట్లు కొట్టేవారు. కాలితో తన్నేవారు" నాయనమ్మ చక్కగా చెపుతుంటే ఒళ్ళు మండి పోయింది రాధికకి.

కాలం పరిగెత్తింది. రాధిక ఎం.ఎ అయింది. 'ఏ సంబంధమూ వద్దంటే మేమేం చేస్తాం! నీకసలు పెళ్ళి చేయలేము" అరుస్తోంది రాధిక తల్లి.

'దాని మనసులో ఏముందో కనుక్కో' అన్నాడు తండ్రి.

రాధిక ఎక్కడికి వెళ్ళినా భార్యాభర్తల్ని గమనిస్తూ ఉంది...నిజంగా వాళ్ళు హాయిగా ఉన్నారా. ఉన్నట్టు కనిపిస్తున్నారా! రాధిక తల్లిదండ్రులకి బెంగ పెరిగిపోయింది. ఆ రోజు బస్‌స్టాండ్‌లో నించున్న రాధిక, స్కూటర్ ఆపిన రఘుకేసి చూసింది. 'హాయ్' అన్నాడు చేయి ఊపి...రాధికా చేయి ఊపింది. రఘుది తమ ఇంటిదగ్గరి ఇల్లే.

'నిన్న బస్ స్టాండ్‌లో రఘు కలిశాడు' అంది భోంచేస్తూ రాధిక. అమ్మ ఉలిక్కిపడడం గమనించింది రాధిక.

'రఘువాళ్ళమ్మ' రాధిక ఏదో అనబోయింది. 'వాళ్ళమ్మ ఎంతో పేచీకోరు, వాళ్ళనాన్న కోపిష్టి, ఇతనికీ అవి వస్తాయి' తల్లి.

తండ్రి తాగుబోతయితే కొడుకు అవాలని ఉందా అంది రాధిక.

అదే బస్‌స్టాండ్‌లో రాధిక నిలబడింది....రఘు మళ్ళీ స్కూటర్ ఆపి హాయ్ అన్నాడు, రెండురోజులుగా రఘు ఇదే ఆలోచిస్తున్నాడు రాధికకి పెళ్ళి సంబంధాలు చూస్తున్నారు కదా తన వాళ్ళతో ఎందుకు మాట్లాడరూ. ఈ విషయం తెల్సుకోవాలనే చిలిపి కోరిక మనసులో కదిలింది.

"మీతో మాట్లాడాలి. మీరు బస్లో, నేను స్కూటర్ పై వెళ్ళొచ్చు. ఇద్దరం ట్యాంక్‌బండ్‌పై మాట్లాడుకుందాం." అన్నాడు నవ్వుతూ.

రాధిక కాలేజీకి వెళ్ళేప్పుడు రఘు ఇంటి ముందు నుంచే వెళుతుంది. బుద్ధిమంతురాలనే సర్టిఫికెట్ తల్లి ఇచ్చింది కూడా. "అమ్మా నా కోసం ఇన్ని సంబంధాలు చూస్తావు..రాధిక గురించి చెప్పవేం అన్నాడు ఓరోజు.

"తల్లి, తండ్రి ఎప్పుడూ పోట్లాడుకుంటారు అంది".

తల్లి మాటలకి నవ్వి ' ఈ కారణంగా మంచి సంబంధం వదులుకుంటామా' అన్నాడు.

టాంక్‌బండ్ బెంచ్ మీద కూర్చున్నారిద్దరూ రాధిక, రఘు.. "పెళ్ళంటే మీ ఉద్దేశమేమిటీ" అన్నాడు నీళ్ళ కేసి చూస్తూ...

'ఇద్దరు మనుష్యుల్ని దగ్గర చేసేదీ..' అంది ఎటో చూస్తూ.

'అంటే' అన్నాడు రఘు.

రాధికకి వెంటనే చిరాకు వచ్చింది..'అతను అడిగేవాడూ, నేను చెప్పేదాన్నినా అనిపించింది.'మీరు చెప్పండి' అంది.

"నాకు తెలియదు. మా అమ్మా, నాన్న హాయిగా ఉన్నారు, మీ అమ్మా, నాన్నకూడా హాయిగా ఉన్నారు. మా నాయనమ్మ, తాతయ్య హాయిగానే ఉన్నారు...అంతే!"

రాధికకి ఆ రోజు నాయనమ్మ అన్న మాటలు గుర్తొచ్చాయి.. 'ఆ సంసారాలన్నీ బాగానే ఉన్నాయంటారా!' అంది.

'ఆc! చెప్పకూడదు కానీ, మా అమ్మా, నాన్న చిలకాగోరింకల్లాగా ఎంత హాయిగా ఉంటారో...' అన్నాడు ఉత్సాహంగా రఘు.

'అదేమిటీ...మీ నాన్నకి చాలా కోపం అని' ఈ మాట అన్నాక రాధిక నాలుక కరుచుకుంది,

'ఓ అదా! కొందరికి కోపం కొంచెం ఎక్కువ. ఆ కోపం వాళ్ళ ప్రేమకి అడ్డు రాలేదే' అన్నాడు.

రాధికకి నానమ్మ, అమ్మ గుర్తుకు వచ్చారు. మనసులో మాట దాచడం అనవసర మనిపించింది.

'ఏదైనా భార్యను గౌరవంగా చూడాలి. కొట్టడం, తిట్టడం, ఛీ, ఎంత అనాగరికం' అంది.

అవును, భార్యని కొట్టడం, తిట్టడం అనాగరికం, రాక్షసం. అంతేకాదు భర్తని కొట్టడం, తిట్టడం కూడా' రఘు ఆమాట అనేసరికి.

'భర్తని కొట్టే భార్యలున్నారా' అంది రాధిక.

'కోపాలు మామూలు...సపోస్, మా అమ్మ పూజ చేసుకుంటూ మరిచిపోయి రెండుసార్లు కూరలో ఉప్పు వేసిందనుకుందాం. నేనయితే ఏమీ అనలేక కూర తినకుండా ఊరుకుంటాను, నాన్నయితే కంచం విసిరికొడతాడు..." రాధిక ఒళ్ళుమండిపోయింది...'అంటే అది కరెక్టే అనా'

'ఏది, కూరలో ఉప్పు వేయడమా, కంచం విసిరి కొట్టడమా' చాలా సరదగా అన్నాడు కొంటెగా...

రాధిక లేచింది....'ఇంతకూ...' అన్నాడు రఘు.

"భార్యని పువ్వుల్లో పెట్టి పూజించాలని మీరు చెపితే విందామని నేను వచ్చా" అంది రాధిక.

"ఛ..ఛ...పువ్వులూ, పూజించటాలుండవు, మీ అమ్మా, నాన్న పోట్లాడుకుంటారని అమ్మ చెప్పింది. అయితేనేం ఆదర్శదంపతులంటే, మీరు కాదంటారా?" రాధికకు ఏమనాలో తోచలేదు.

రఘు ఒక అహంకారి.... అని మాత్రం అర్థమయింది రాధికకి. రాధిక ఒక స్టుపిడ్ గార్ల్.... అర్థం లేని అపోహల్లో ఉంది పాపం అనుకున్నాడు రఘు. 'రాధికగారూ పెళ్ళంటే నేల మీద నిలబడి ఆలోచించాలి. ఒకరినొకరు అర్థం చేసుకుంటే జీవితం చాలా హాయిగా సాగిపోతుందండీ, అది కాక భార్యాభర్తలయ్యాక కోపగించుకోకుండా, కౌగిలించుకోకుండా, ముద్దు...సారీ.... నా మటుకు నేను భార్య పైన అవసరమొస్తే అరుస్తాను, తిడతాను...కొడతానేమో? నేను పెళ్ళి, చేసుకోబోయే అమ్మాయికి ఇవన్నీ చెప్తా. ఇష్టమయితేనే చేసుకుంటుంది" అన్నాడు రాధిక వంక చూస్తూ...

"నేను చెప్తా, ఒక్క మాట కూడా నన్ను అనకుండా ఉంటేనే పెళ్ళి చేసుకుంటానని చెప్తా" 'వెనుకటి ఇలాగే ఒకామె నేను ఏం చేసినా నువ్వేమీ అనకూడదు, అందిట...ఆ ప్రేమ పిచ్చిలో సరే అన్నాడు చివరికి...'

"హాయిగా ఉన్నారుగా" అంది రాధిక.

'విడిపోయారు' రఘు కాస్త కసిగా అన్నాడు.

రఘు భార్యతో టాంక్‌బండ్ దగ్గరకొచ్చి బెంచి మీద కూచున్నాడు...దూరంగా వస్తున్న రాధిక వాళ్ళని చూసింది...అరే...జానకీ, తన క్లాస్‌మేట్. అయ్యో ఇంత అహంకారిని చేసుకొని ఏ సుఖపడుతుందో పాపం!

ఇంటికి వచ్చాక రాధిక జానకికి ఫోన్ చేసింది. "జానకీ, మనిద్దరం కలిసి కబుర్లు చెప్పుకోవాలి. ఎక్కడ కలుద్దాం" అంది రాధిక.

జానకి, రాధిక బిర్లా టెంపుల్ మెట్ల మీద కూచున్నారు చాలా సేపు ఆ మాటలు, ఈ మాటలూ మాట్లాడుకున్నారు.

"మా ఆయనంటాడు...నన్ను పువ్వుల్లో పెట్టి పూజిస్తానని. నాన్సెన్స్. పూజలేమిటే... ప్రేమ కావాలి. మొన్న ఓ తమాషా జరిగింది. కూర చేశా ఈ లోపల టీ.విలో సీరియల్ వస్తే చూస్తూ కూర్చున్నా... ఉప్పు వేయడం మరిచిపోయా. కంచంలో చేయి కడుక్కుని వెళ్ళి పోయారు... ఆయనకి కోపం వస్తే అంతే....మళ్ళీ వండి పెట్టాను. ఇద్దరం తిన్నాం. లైఫ్ ఈజ్ దట్ అంది జానకి...

కాలం పరుగెడుతోంది....స్కూటర్ మీద భార్య, పిల్లాడితో రోజూ ఇంటి ముందు నుంచీ వెళ్ళే రఘుని చూస్తూ మగాళ్ళంతా ఇంతేనేమో అనుకుంది. అంతలోనే ఆడవాళ్ళూ ఇంతేనేమో అనుకుంటూ జుట్టులో మెరుస్తున్న వెండి తీగల్ని సరిచేసుకుంది. రాధిక.

- ఆంధ్రప్రభ ఆదివారం 9 సెప్టెంబర్ 2001